క్లుప్తంగా

ప్రజల ఇబ్బందులు పట్టవా?

టీపీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్ధేశ్వర్



మొయినాబాద్: మండలంలో సరిపడా మీసేవా కేంద్రాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోరా అంటూ టీపీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్ధేశ్వర్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో 28 గ్రామ పంచాయతీలకు ఒకే మీసేవా కేంద్రం ఉంది. గతంలో మండలంలో మూడు మీసేవా కేంద్రాలు ఉండగా వివిధ కారణాలతో రెండు మీసేవా కేంద్రాలు మూతపడ్డా యన్నారు. రెడ్డిపల్లిలో ఉన్న ఒకే ఒక్క మీసేవా కేంద్రంతో మండల ప్రజల అవసరాలను తీర్చడం కష్టంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన అన్ని రకాల దరఖాస్తులు మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. మూడేళ్లుగా ఒక్క మీసేవా కేంద్రంతో ఇబ్బంది పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. శుభోదయం అంటూ గ్రామాల్లో తిరిగిన ఎమ్మెల్యే ఎన్ని సమస్యలు పరిష్కరించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మీసేవా కేంద్రాలను పెంచేందుకు పోరాటం చేస్తామన్నారు.

హెల్మెట్ల పంపిణీ



యువతకు హెల్మెట్లు అందజేస్తున్న నర్సింహయాదవ్

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేటలో శనివారం పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'విష్ణు అన్న కానుక' పేరుతో యువతకు బీజేపీ నాయకులు హెల్మెట్లను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురికి హెల్మెట్లను అందజేశారు. ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ వాహనదారులు ప్రయాణాలను సాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మోహన్‌సింగ్, శ్రీనివాస్, భాస్కర్‌నాయక్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేష్, పాండు, రాఘవేందర్, బాలరాజ్, రాజు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామ పరిధిలోని వేదగిరి గుట్టపై ఆదివారం ఉ.10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వేదగిరి సంస్థాపకాచార్య డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వేదగిరికి సంబంధించిన 108 గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

సభను విజయవంతం చేద్దాం

కొందుర్గు: మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పాలమూరు ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చౌదరిగూడలో ఏర్పాటు చేసిన సభ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు శ్రీనివాస్, నర్సింహ, రవీందర్‌రెడ్డి, రాజు, భీమయ్య, లింగం పాల్గొన్నారు.

చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి రాజీనామా



రాజీనామా పత్రాన్ని సీఈఓ వెంకటయ్యకు అందజేస్తున్న కృష్ణారెడ్డి

చేవెళ్ల: వ్యక్తిగత కారణాల వల్ల తన పీఏసీఎస్ డైరెక్టర్ పదవీకి రాజీనామా చేస్తున్నట్లు చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ నత్తి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్లలోని పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ వెంకటయ్యకు తన రాజీనామా పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేశానని చెప్పారు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పదవీతో పాటు కాంగ్రెస్‌పార్టీని కూడా వీడుతున్నట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీనునాయక్, కార్మికులు

అంగన్‌వాడీల 'పోరుబాట'

మూతపడిన కేంద్రాలు

- డిమాండ్లు నెరవేర్చాలని ఆశల ఆందోళన
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని అధికారులు



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు, (ఇన్‌సెట్‌లో) మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

కొత్తూరు: తమ సమస్యలు, డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు, ఐసీడీఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు వేర్వేరుగా ధర్నాలు చేపట్టారు. అంగన్‌వాడీలు చేపట్టిన ధర్నా శనివారంతో ఇరువై రోజులకు చేరింది. ఆశల ఆందోళన ఆరుగా సాగుతోంది. అయినప్పటికీ ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో విధులు బహిష్కరించి ధర్నాలు చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా మూతపడటంతో మందులు, వైద్యం విషయంలో పీహెచ్‌సీ వైద్యులు పలు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

కొత్తూరు మండలంలో 27 అంగన్‌వాడీ సెంటర్లు, 4 మినీ సెంటర్లు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 662 మంది చిన్నారులు, 574 మంది గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అలాగే, 31 మంది టీచర్లు, 21 మంది హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, పీహెచ్‌సీ పరిధిలో ప్రతిరోజు 39 మంది ఆశవర్కర్లు పలు రకాల వైద్య సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పని చేస్తున్నారు.

సమ్మెతో గ్రామాల్లో సమస్యలు

శంకర్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండటంతో గ్రామంలో సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. సమ్మెతో గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు మూత పడ్డాయి. ఎక్కడ చూసినా అంగన్‌వాడీ కేంద్రాలు తాళం వేసి ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు రావడం లేదు. గర్భిణిలకు, బాలింతలకు అందాల్సిన పౌష్టికారం అందడం లేదు. ఆశ వర్కర్లు సమ్మె ఉండడంతో వైద్య సేవలు నిలిపోయాయి. అలాగే, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో మండలంలోని కొన్ని పాఠశాలలో అక్షయ పాత్ర వారు మధ్నాహ్న భోజనం అందించగా, మరికొన్ని పాఠశాలల్లో ప్రైవేట్ వ్యక్తులు భోజనం వండుతున్నారు.



శంకర్‌పల్లి: అయ్యప్పరెడ్డిగూడలో తాళం వేసిన అంగన్‌వాడీ కేంద్రం

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, హెల్పర్లు గత ఇరువై రోజులుగా ధర్నా చేస్తుండడంతో మండలంలోని 27 కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. గతంలో అక్షయపాత్ర ద్వారా సరఫరా అవుతున్న భోజనం ఆగిపోయింది. దీంతో నేరుగా అర్హులకు సూపర్‌వైజర్లే సరుకులు పంపిణీ చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో గర్భిణిలు, బాలింతలకు సరుకులు సైతం తీసుకోవడం లేదు. అంగన్‌వాడీల ధర్నాతో చిన్నారులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఆశలు ధర్నాలో ఉండడంతో ఏఎన్‌ఎంలు పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించాల్సి వస్తుంది. గ్రామాల్లో గర్భిణిలను గుర్తించి వారి వివరాలు నమోదు చేయడం, ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా, చిన్నారులకు టీకాలు వేయించేందుకు అవగాహన కల్పించడం లాంటి విధుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆశలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రమాద బీమా సౌకర్యం 5 లక్షలు ఇవ్వడంతో పాటు వారి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. అదనపు పని గంటలకు వేతనాలు ఇవ్వాలి. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో అవకాశం కల్పించాలి.

– కవిత, ఆశవర్కర్, కొత్తూరు

కనీస వేతనం ఇవ్వాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిపాలనలో ఆశల విధులు చాలా ముఖ్యం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఆరోగ్య వివరాలతో పాటు గర్భిణీలు, బాలింతలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని మేమే సేకరిస్తాం. ప్రభుత్వం మా సేవలను గుర్తించి నెలకు రూ.18 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌర్యాలు కల్పించాలి.

– జహంగీర్, ఆశవర్కర్, కొత్తూరు

రూ. 2.05 కోట్ల రుణమాఫీ

పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

కొందుర్గు: కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో ప్రభుత్వం 360 మంది రైతులకు రూ.2.05,7200 రుణమాఫీ వచ్చిందని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం సహకారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ రుణాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 38 మంది రైతులకు రూ.2.10 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందించామన్నారు. దాదాపు 1000 మంది రైతులకు రూ.7 కోట్ల స్వల్పకాలిక రుణాలు ఇచ్చామని వివరించారు. రుణమాఫీ పొందిన రైతులు రుణమాఫీ పోను మిగతా డబ్బులు చెల్లించి పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అబ్దుల్ ఖాదర్, సీఈఓ మహిమూద్ షరీఫ్, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, జబ్బార్, నారాయణగౌడ్, బాలమణి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జన వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగించే పనులు ప్రారంభిస్తున్న, శైలజ, పాలకవర్గం సభ్యులు

చేవెళ్ల: చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి పుష్కరిణీలో వినాయక నిమజ్జనాల వ్యర్థాలను తొలగించే పనులను శనివారం చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పాలకవర్గం సభ్యులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలజ మాట్లాడుతూ.. విగ్రహాల వ్యర్థాలతో పుష్కరిణీలోని నీళ్లు కలుషితమవుతాయని వెంటనే తొలగిస్తున్నామని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలు పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు చేశారు. వీటిని జేసీబీల సహాయంతో బయటకు తీసి ట్రాక్టర్ల ద్వారా దూరంగా వేయిస్తున్నట్లు చెప్పారు. వెంటనే స్పందించి పనులు చేపడుతున్న సర్పంచ్, పాలకవర్గం సభ్యులను మండల, గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగా యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



లడ్డూను కైవసం చేసుకున్న రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో నిర్వాహకులు శనివారం ఘనంగా పల్లకీ సేవను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆటపాటలు, భజనలతో స్వామివారిని ఊరేగించారు. వినాయక చవితి సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వేలం వేసిన స్వామి లడ్డూ బుద్వేల్‌కు చెందిన రవీందర్‌రెడ్డి, భాగ్య దంపతులు రూ.40వేలకు కై వసం చేసుకున్నారు. అలాగే, చిన్న లడ్డూను నర్సింహ్మా, యాదమ్మ దంపతులు రూ.16వేలకు దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, నర్సింహ్మా, భక్తులు వసంతరావు, అన్నారం రఘు, పినబాక ప్రభాకర్, సతీష్, రమేష్, రఘునందన్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మణ్, కిషన్, రాఘవేందర్, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో 'సొసైటీ' భవనం

చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: తన సొంత నిధులతో సొసైటీ కార్యాలయ భవనం నిర్మిస్తానని చేవెళ్ల ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీని రూ.కోటి బ్యాలెన్స్‌కు తీసుకువచ్చామని తెలిపారు. రెండుసార్లు తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన రైతుల, ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. అన్నదాతల సౌకర్యార్థం రూ.35 లక్షల సొంత డబ్బులతో సంఘం భవనం నిర్మిస్తానని తెలిపారు. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు స్పష్టం చేశారు.

రూ.కోటి బ్యాలెన్స్‌తో సొసైటీ నడుస్తోంది..

2013లో మొదటి సారి చైర్మన్‌గా ఎన్నికైనప్పుడు అప్పట్లో ఉన్న సొసైటీని ప్రస్తుతం కోటి రూపాయల నిధుల నిల్వతో నడిచే సొసైటీగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా సొసైటీ బ్యాంక్‌లో స్ట్రాంగ్‌రూంను రూ. 6లక్షలతో నిర్మించామన్నారు. కొత్తగా రూ.38లక్షలతో గోదాం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో చేవెళ్ల సొసైటీ పరిధిలో మొత్తం 590 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 404 మంది రైతులకు మాఫీ వచ్చిందని, ఇంకా 186 మంది రైతులకు రావాల్సి ఉందని తెలిపారు. గతంలో 1095 మంది సొసైటీలో మెంబర్‌లుగా ఉంటే ఇప్పుడు రైతుల సంఖ్యలను 1798కి పెరిగిందన్నారు. బ్యాంకులో రుణాలు పొందిన రైతులు సంఖ్య 703 మంది మాత్రమేనని చెప్పారు. అందరి సహాయ సహకారంతో చేవెళ్ల సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్య, వైస్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు దామోదర్‌రెడ్డి, రాములు, చేవెళ్ల సర్పంచ్ బి. శైలజ ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీను, కాంగ్రెస్‌పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు సమత ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులే అభివృద్ధి చెందారు..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న శంకర్, తదితరులు

కేశంపేట: బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు, అవినీతితో అభివృద్ధి చెందారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మండల పరిధిలోని నిర్దవెల్లిలో శనివారం ×ఆరు గ్యారెంటీ¤ పథకాలపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వారి కార్యకర్తలకే ఇచ్చారని అన్నారు. తొమ్మిదేళ్లుగా గ్రామాల్లో ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదని వాపోయారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం నేటికి నెరవేర్చాలేదని విమర్శించారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త హామీలతో గ్రామాలకు వచ్చేందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమయ్యారని మండిపడ్డారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే, మండల కేంద్రంలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న ఆశకార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వీర్లపల్లి శంకర్ సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో షాద్‌నగర్ మార్కెట్ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, పెంటయ్య, రూప్లానాయక్, గోపాల్, రమేష్, అఖిల్, కర్నాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇచ్చేవరకు పోరాటం



మానవహారంగా ఆశ కార్యకర్తలు

కొందుర్గు: తమ కనీస వేతనం ఇచ్చేవరకు పోరాడుతామని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో ఆశ కార్యకర్తలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు ఆరోగ్య సేవలందించే తమకు కనీస వేతనం ఇవ్వాకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్, ఆశ కార్యకర్తలు అంజలి, సువర్ణ, జయ మ్మ, నీరజ, సుందరమ్మ, మాధవి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సురేఖ, సంజీవ్ రంజన్

షాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, సీఎస్ఆర్ సంజీవ్ రంజన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగర్‌కుంటలో సర్పంచ్ జయమ్మ, వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది రైతులకు కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకుని సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలు నాటితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కూరగాయల పంటలను సేంద్రియ పద్ధతుల్లో పెంచాలని సూచించారు.

చదువుతోనే విద్యార్థులకు ఉన్నతస్థాయి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హన్మంత్‌రెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లిలోని వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమం మున్సిపల్ పరిధిలోని రామంతపురం మాణిక్యారెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. విలువలతో కూడిన విద్య అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ హన్మంత్‌రెడ్డి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మోయిన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తుంటాయి..



ఓమర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరిని ఎంఈఓ శంకర్‌రాథోడ్, హెచ్ఎం నాగిరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల సబ్‌ర్డినెట్ ఎండీ ఓమర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనివార్యమన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించి, అందరి మన్ననలు పొందిన ఓమర్ పదవీ విరమణ బాధను కలిగిస్తుందన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉండి సంతోషజీవితం గడపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీ సునీత, ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, సులోచన, కిరణ్మయి, ప్రభాకర్, సత్యనారాయణ, రమేష్, శోభారాణి, గ్లోరి, అంజయ్య, గోవింద్, సుశీల, జంగయ్య, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్థసారధికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. పెరిగిన కోడిగుడ్ల ధర లకు అనుగుణంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని యెడ ల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుజ్జమ్మ, చిట్టి మ్మ, సరోజ, శిరీష, లక్ష్మమ్మ, సుమలత, కావ్య, నిర్మలమ్మ, పద్మమ్మ, అనిత, భారతమ్మ, చంద్రకళ, రేష్మ, అక్కమ్మ, కళావతి, సత్యమ్మ, పావని పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

మొయినాబాద్: బీఆర్ఎస్ పార్టీ రెడ్డిపల్లి గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కావలి ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా పరందామ, ఆంజనేయులు, చిన్నవెంకటయ్య , అశోక్, ప్రకాష్, ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, యూత్ అధ్యక్షుడిగా వివేక్, క్రీడా అధ్యక్షుడిగా ఉదయ్, బీసీసెల్ అధ్యక్షుడిగా రఘు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా మల్లేష్, సాంస్కృతిక అధ్యక్షుడిగా వీరేష్, కార్యదర్శిగా శ్రీనివాస్, మీడియా ప్రతినిధిగా రవీందర్‌రెడ్డి, ముఖ్యసలహాదారుగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ఎంపీటీసీలు మోర శ్రీనివాస్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ నర్సింహారెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న జీపీ సిబ్బంది

కేశంపేట: జీపీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె కొనగిస్తామని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ నర్సింహరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్రకుమార్‌రెడ్డికి శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. గతంలో 34 రోజులు సమ్మెను నిర్వహించారని, సమ్మె విరమిస్తే సమస్యలు పరిష్కారిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారని అన్నారు. మంత్రి మాటలను నమ్మి సమ్మెను విరమించాం. అయినా సమస్యలను పరిష్కారం కాలేదు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, మల్లయ్య, బుచ్చయ్య, యాదయ్య, జంగయ్య, యాదమ్మ, రోశయ్య, రవికుమార్, పారేష తదితరులు పాల్గొన్నారు.